వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

రసూల్‌పురా: స్వచ్ఛందసంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ కోరారు. పెనియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొల్లారం డౌటన్‌బజార్ రీడింగ్ రూంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జయప్రకాష్ పాల్గొన్నారు.

వర్సిటీలపై సీఎం దృష్టి సారించడం హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల పై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిసారించడం హర్షణీయమని వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్టు) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పరుశురాం ఆదివారం పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఈ సందర్భంగా కోరారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇవ్వాల్సని, 7వ వేతన సవరమణ అమలు, యూజీసీ నిబంధనల ప్రకారం పర్మనెంట్ అధ్యాపకులకు వర్తించు నిబంధనలకు కాంట్రాక్టు అధ్యాపకులకు కూడ అమలు చేయాలని కోరారు.

ఘనంగా బోనాల వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్

అడ్డగుట్ట: అడ్డగుట్ట కురుమ సంఘం ఆధ్వర్యంలో శాస్త్రినగర్‌లోని బీరప్ప స్వామి ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన మర్రి శశిధర్‌రెడ్డి



సనత్‌నగర్: ప్రమాదంలో గాయపడ్డ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కాలుకు తీవ్రంగా గాయం కాగా ప్రమాద సంఘటన గురించి తెలుసుకోవడంతో పాటు ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి అడుగిడాలని ఈ సందర్భంగా మర్రి ఆకాంక్షించారు.

అభిషేక్ సింఘ్వీకి సత్కారం



అభిషేక్ సింఘ్వీని సన్మానిస్తున్న శ్రీనివాసులు గౌడ్

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు గౌడ్ ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నివాసంలో ఏఐసీసీ లీగల్ సెల్ చైర్మెన్ అభిషేక్ సింఘ్వీని మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ లీగల్ వ్యవహారాలపై చర్చించారు. అనంతరం సింఘ్వీని సన్మానించారు.

మైరాన్ హోమ్స్ టీవీసీ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని హోటల్ ఆవాస లో జరిగిన మైరాన్ హోమ్స్ టీవీసీ క్యాంపైన్‌లో పలువురు సినీప్రముఖులు సందడి చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు అశ్వినీ దత్, కె.ఎస్.రామారావు, మురళీ మోహన్‌లు మైరాన్ హోమ్స్ టివిసిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత అశ్వని దత్ మాట్లాడుతూ.. మధ్య, సంపన్న తరగతుల ప్రజల సొంతింటిటి కలను నిజం చేసేలా మైరాన్ హోమ్స్ ప్రారంభించడం అభినందనయమన్నారు. సంస్థ సీఎండీ డా .యువరాజు పాల్గొన్నారు.

ప్రొ.కోదండరామ్‌కు డిప్యూటీ మేయర్ అభినందనలు



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాలను ఏకం చేసి సారథిగా వ్యవహరించిన ప్రొ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సముచితమైన గౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కల్పించిందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తార్నాకలో ఆయన నివాసంలో నూతన ఎమ్మెల్సీ ప్రొ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

'గాంధీ'లో కొనసాగుతున్న ఆందోళన



గాంధీఆస్పత్రి : కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం ఘటనను ఖండిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు జూడాలు చేస్తున్న ఆందోళన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆదివారం కూడా కొనసాగింది. ఓపీ విధులను బహిష్కరించిన జూడాలు ఆస్పత్రి ప్రధాన భవనం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కూడా ఈ ఆందోళన, నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని జూనియర్ డాక్టర్ల సంఘం గాంధీ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు.

ఈ ఘనత జై గౌడ ఉద్యమాల వల్లే...

ఉస్మానియా యూనివర్సిటీ: జై గౌడ ఉద్యమాల వల్లే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ప్రభుత్వ నిర్వహించడం ఆనందగా ఉందన్నారు. పాపన్న జీవిత చరిత్ర ప్రచారం కోసం జై గౌడ్ నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లోని అంబేద్కర్ కాలనీ, సీబీఐ కాలనీ బస్తీల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ బస్తీల్లో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అంబేద్కర్ కాలనీబస్తీకి చెందిన కొమ్ము శేఖర్ వద్ద 113 మద్యం సీసాలు, సీబీఐ కాలనీలోని కర్రయ్య వద్ద 115 వివిధ రకాల మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

మేధావులు చట్టసభల్లో ఉంటే పేదలకు మేలు



ప్రొఫెసర్ కోదండరామ్‌కు అభినందనలు తెలుపుతున్న అభిషేక్

సనత్‌నగర్: చట్టసభల్లో ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి మేధావులు ఉండడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎన్ఆర్ఐ, యువ నాయకులు అడపా అభిషేక్ అన్నారు. ఎమ్మెల్సీగా నూతనంగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆదివారం ఆయన తన అనుచరులతో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు ముగిసాయి. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్న స్వామి ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాల రావు, ఈఓ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

సాయం చేయడంలోనే ఆత్మసంతృప్తి



షేక్ యాకుబ్‌కు చెక్కును అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: నిరుపేదలకు సాయం అందించడంలోనే సంతృప్తి లభిస్తుందని బ్రాహ్మణ సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. నిరుపేద కుటుంబంలో జరిగే వివాహ నిమిత్తం వధువు సోదరుడు షేక్ ఆయూబ్‌కు ఆదివారం ఆయన రూ.25,000 ఆర్థిక సహాయ చెక్కును అందించారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘాల సమాఖ్య తరుపున, తన వ్యక్తిగతంగా నిరుపేదలకు సేవలు అందించేందుకు ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు జీహెచ్ఎంసీ మాజీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వచ్ఛందంగా చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ అశోక్, డివిజన్ నాయకులు నరసింహ, కాసుల మహేష్‌గౌడ్, మధురానగర్ బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా సరోజ



లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గం తార్నాక మున్సిపల్ డివిజన్ హనుమాన్‌నగర్‌కు చెందిన సరోజ బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆదివారం ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ సరోజకు అందజేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో వివిధ కాలనీల నివాసితులు

సనత్‌నగర్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ సనత్‌నగర్‌లోని వివిధ కాలనీవాసులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకతీతంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు పెరుమాళ్ల నాగమణి నేతృత్వంలో ఎస్సార్టీకాలనీకి చెందిన సుమారు 100 మంది కొవ్వొత్తులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. సనత్‌నగర్ బస్టాండ్‌లో ప్రారంభమైన ర్యాలీ సనత్‌నగర్, ఎస్సార్టీకాలనీ, నెహ్రూ పార్కు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. మురారిశెట్టి సత్యనారాయణ, ఆకూరి శ్రీనివాసరావు, హృషీకేశ్, చేతన, లక్ష్మీనారాయణ, న్యాయవాది కళావతి, ఆకుల మహేష్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో సక్సెస్ మీట్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ రంగ విద్యా సంస్థలతోనే పేద విద్యార్థులకు ఉన్నత చదవులు లభిస్తాయని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ఇటీవల జేఎల్, గురుకుల డీఎల్ ఉద్యోగాలు సాధించిన వారి ఆధ్వర్యంలో ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఎంపీఎస్ ఎకనామిక్స్ సక్సెస్ మీట్-2024 నిర్వహించారు. కార్యక్రమానికి ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగాలు సాధించిన 60 మందికి ఉచిత శిక్షణ అందించిన నల్గొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ మీనయ్యను అభినందించారు. బోధన వృత్తిలో కొనసాగే వారు విశాల భావంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, ప్రొ.కాశీం, డా.ఉపేందర్, డాక్టర్ దుబ్బ రంజిత్‌తో పాటు పలువురు విశ్రాంత అధ్యాపకులు ప్రసంగించారు.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



తార్నాకలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

లాలాపేట: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన టెన్త్ క్లాస్ విద్యార్థిని సాత్విక, తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్ ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తార్నాక చౌరస్తాలో పలువురు ఆటో డ్రైవర్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలను సిటీలోకి అనుమతించడం మూలంగానే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కొమురెల్లి బాబు,రాములు, శ్రీహరి, హుస్సేన్, శివ, రవికాంత్ తదితరులున్నారు.

సీఎండీకి అభినందనలు

వెంగళరావునగర్: తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 నాయకులు ఆదివారం ఆ శాఖ సీఎండీని మర్యాద పూర్వకంగా కలిశారు. టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని గతంలో అనేకమార్లు తమ యూనియన్ తరఫున అధికారులకు వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. కాగా ఇటీవల టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన దాదాపు మూడువేల మంది ఉద్యోగులకు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ పదోన్నతులు కల్పించారని నేతలు పేర్కొన్నారు. తమ అభ్యర్థనను పరిగణలోనికి తీసుకుని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాను కప్పి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా 1535 వ్యవస్థాపక అధ్యక్షులు వజీర్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్, కె.శ్రీనివాస్, యూనియన్ నేతలు లింగం, సురేష్, సాయి, సోనీ, రాజు, వసంత తదితరులు ఉన్నారు.

కెమెరాలు అద్దెకు తీసుకొని...

తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: కెమెరాలు అద్దెకు తీసుకుని తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... కళ్యాణ్‌నగర్‌కు చెందిన సి.హెచ్. రాజాఅన్వేష్ ఎల్లారెడ్డిగూడలో కెమెరాలను కిరాయికి తిప్పుతుంటాడు. గత నెల 28న కుషాయిగూడకు చెందిన నందగిరి నరేందర్, ఎస్.ఉమేష్‌లు ఎల్లారెడ్డిగూడలోని రాజా అన్వేష్ షాపునకు వచ్చి రూ.2.50 లక్షల విలువైన కెమెరాలు, లెన్స్‌లు, బ్యాటరీలు, చార్జర్లు తీసుకెళ్లారు. ఆ సమయంలో రోజుకుం రూ.1500 కిరాయి చెల్లిస్తానని చెప్పారు. తొలిరోజు అద్దె ఇచ్చిన ఇరువురు మూడు రోజులైనా కిరాయి పంపలేదు. నరేందర్‌ను అద్దె విషయంపై ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. దీంతో బాధితుడు నరేందర్ ఆధార్‌కార్డును కెమెరా అసోసియేషన్ గ్రూప్‌లో పెట్టి విషయాన్ని తెలియజేశాడు. ఈ నెల 1న ఆనంద్ నుంచి నరేందర్ కెమెరాలు, లెన్స్ అద్దెకు తీసుకున్నాడు. 17వ తేదీన నరేందర్ మళ్లీ మోహముక్తార్ షాపునకు వెళ్ళి కెమెరాలు అద్దెకు కావాలని అడిగాడు. దీంతో అప్పటికే వాట్సప్ గ్రూప్‌లో అతని ఆధార్‌కార్డు వివరాలను చూసిన ముక్తార్ వెంటనే రాజా అన్వేష్‌కు విషయాన్ని తెలిపి నరేందర్‌ను పట్టుకుని మధురానగర్ పీఎస్‌కు తీసుకువచ్చాడు. అనంతరం నిందితుడిపై రాజా అన్వేష్, ముక్తార్‌లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

పంజగుట్ట: మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు చేతులమీదుగా ప్రారంభమై ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వంటి ఎంతో మంది గొప్పవారికి ఆశ్రయం ఇచ్చిన కాచిగూడ (నింబోలి అడ్డ) సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు బొమ్మెర రామ్మూర్తి, సంగమేశ్వర్, సునీల్‌లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో చరిత్ర కలిగిన హాస్టల్ కాచిగూడ హాస్టల్ అని దీన్ని ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా సందర్శించడం విశేషమన్నారు. ఈ హాస్టల్‌లో ప్రస్తుత మంత్రులతో పాటు ఎంతో మంది ప్రముఖులు గడిపారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ తరువాత అంతటి కీలకపాత్ర పోషించిందన్నారు. అలాంటి హాస్టల్ 2019 కరోనా సాకుతో మూసివేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా హాస్టల్‌ను తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బోయిన శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు కోసం దాడి

వెంగళరావునగర్ : ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తిపై దారి దోపిడీ చేసేందుకు ఇరువురు యువకులు ప్రయత్నించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడకు చెందిన బోయ ఆంజనేయులు కొబ్బరికాయలతో హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటాడు. 18వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళుతూ రహమత్‌నగర్ జానకమ్మతోట వద్ద ఫోన్ మాట్లాడటానికి ఆగాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ఇరువురు యువకులు వచ్చి అతని మెడలోని బంగారు గొలుసును చోరీ చేయడానికి ప్రయత్నించగా ఆంజనేయులు అడ్డుకున్నాడు. పెనుగులాటలో బంగారు గొలుసు రోడ్డుమీద పడిపోవడంతో దానిని తీసుకుంటుండగా ఇరువురు యువకులు ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. తనపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జరిమానాలు విధించినా.. జంకడం లేదు..!

7 నెలల్లో లక్షన్నర దాటిన కేసులు



హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతున్న స్కూటరిస్టుకు జరిమానా విధిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

- హెల్మెట్ ధరించకుండా పట్టుబడ్డ 1,71,535 మంది
- నిత్యం వాహన తనిఖీల్లో పట్టుబడుతున్న ద్విచక్రవాహనదారులు
- హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ప్రమాదం : ఏసీపీ హరిప్రసాద్

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని హెల్మెట్ ఉల్లంఘన కేసులు..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	ఉల్లంఘించిన వారి సంఖ్య
పంజగుట్ట	37,554
ఎస్ఆర్‌నగర్	36327
జూబ్లీహిల్స్	41,396
బంజారాహిల్స్	56,258

బంజారాహిల్స్: శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహన దారులపై ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నా తీరు మాత్రం మారడం లేదు. ప్రతిరోజూ ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు తనిఖీలు చేపడుతూ పెద్దఎత్తున వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో తరచూ పట్టుబడుతున్న వారిలో యువకులే 90 శాతం ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి జులై 31 వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్ లేకుండా బైక్‌లు నడుపుతూ 1,71,538 మంది పట్టుబడ్డారు. వీరందరికీ జరిమానాలు విధించారు. ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో పోలీసులు ఈ తనిఖీలు చేపడుతున్నారు. ప్రతిరోజూ హెల్మెట్ లేని వాహనదారులు 150 మందికి పైగానే ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడుతుండడం గమనార్హం. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రతియేటా పట్టుబడుతున్న వారి సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నా యువకులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

జరిమానాలు ఇలా..

ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా మొదటిసారి పట్టుబడితే రూ.100 జరిమానా విధిస్తారు. అదే నెలలో రెండోసారి కూడా పట్టుబడితే రూ.235, మూడో సారి పట్టుబడితే రూ. 600 జరిమానా విధిస్తారు. ఒకే నెలలో మూడు సార్లు పట్టుబడితే జరిమానాలు ఈ రకంగా విధిస్తున్నారు.



ప్రతిరోజూ తనిఖీలు

హరిప్రసాద్ కట్టా, ఏసీపీ, వెస్ట్‌జోన్ ట్రాఫిక్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేకపోతే జరిమానాలు విధించడం జరుగుతుంది. మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు ఆయా చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మృత్యువాత కూడా పడతారు. వాహనదారులు ఇంటి నుంచి గమ్యస్థానాలకు వెళ్లి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవాలంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసుకోవాలి. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలు, ధరించకపోతే కలిగే నష్టాలు కూడా వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.